

ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యం

మేడ్చల్‌జనవరి8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రజావాణిలో వచ్చిన అర్జీలకు ప్రాధాన్యం ఇచ్చి సత్వరమే పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి 193 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

తెలంగాణను నాశనం చేసిన కేసీఆర్

- వికారాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా
- అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు/వికారాబాద్, జనవరి 8: పదేళ్లు పరిపాలించిన కేసీఆర్ తెలంగాణను నాశనం చేశాడని, రాష్ట్రాన్ని 10లక్షల కోట్ల అప్పులో ముంచాడని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. స్పీకర్‌గా వికారాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ధారూరు మండలం కేరెల్లి పంచాయతీ పరిధి కొండాపూర్‌కుర్థు గ్రామంలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ వైపు ఆరు గ్యారంటీల అమలుతో పాటు అప్పుల కుప్పలో నుంచి రాష్ట్రాన్ని బయటకు తీసుకురావటానికి సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా కష్టపడుతున్నారని చెప్పారు. మన ప్రాంతానికి సాగు, తాగునీరు రాకుండ కేసీఆర్ ద్రోహం చేశాడని ఆయన ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రాణహిత, జూరాల ప్రాజెక్టు కేసీఆర్ రాకుండా చేశాడని ధ్వజమెత్తారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతుల కోసం రూ. 300నుంచి 400 కోట్ల వరకు నిధులను మంజూరు తీసుకున్నామని వివరించారు. గత ఎమ్మెల్యే సహకరించకపోయినా కేరెల్లి పంచాయతీని బాగా అభివృద్ధి చేశాడని సర్పంచు నర్సింహారెడ్డిని స్పీకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, సర్పంచు నర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, పెంటారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, పి.రాములు పాల్గొన్నారు. కాగా వికారాబాద్ మండలం, పులుమద్దిలో బీరప్ప జాతర పురస్కరించుకుని స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్పీకర్‌ను ఘనంగా సన్మానించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదులో తప్పులు దొర్లొద్దు

- మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ జనవరి 8, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల్లోని వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదుపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 16 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు తప్పులు లేకుండా ఫారాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకు ముందు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రజాపాలనలో భాగంగా గ్రామ పంచాయతీల్లో 2,29,000 దరఖాస్తులను స్వీకరించినట్లు కలెక్టర్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి వివరించారు. ప్రతి రోజు 40వేల దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

అడుగంటుతున్న ఆశలు!

ఆధునికీకరణకు నోచని కోట్‌పల్లి ప్రాజెక్టు

- శిథిలమైన కల్వర్టులు
- తెగిపోయిన కాలువలు
- ప్రాజెక్టు మరమ్మతులకు గ్రహణం
- అదిగో ..ఇదిగో నిధులు అంటూ ఆశ చూపుతూ వచ్చిన పాలకులు
- కాలువల మరమ్మతులు లేక సాగుకు దూరమైన వేరుశనగ రైతులు

కోట్‌పల్లి ప్రాజెక్టుపై రైతుల ఆశలు అడుగంటుతున్నాయి. ప్రాజెక్టులో నిండా నీరు చేరినా చివరి ఆయకట్టుకు నీరు అందలేని పరిస్థితి నెలకొంది. 9200 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం 4వేల ఎకరాలకు కూడా నీరందించలేక పోతోంది. కాలువలు ఆనవాళ్లు కోల్పోయాయి.. తూములు శిథిలమయ్యాయి.. వెరసి రైతులు సాగుకు దూరమయ్యారు. ఒకప్పుడు ప్రాజెక్టు నీటితో వ్యవసాయం చేసి పసిడి పంటలు పండించు కున్నరైతులు ఇప్పుడు వర్షాధార పంటలతోనే సరిపెట్టుకుంటున్నారు.



ముళ్ల పొదలతో ఆనవాళ్లు కోల్పోయిన ఆర్2 కాలువ

పెద్దేముల్, జనవరి 8: కోట్‌పల్లి ప్రాజెక్టుపై రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి.. ప్రాజెక్టులో నిండా నీరు చేరినా పొలాలకు అందుతాయనే భరోసా లేకుండా పోయింది. ప్రాజెక్టు మరమ్మతులకు అదిగో నిధులు...ఇదిగో నిధులు అంటూ పాలకులు రైతులను మభ్యపెడుతూ వస్తున్నారు. పదేళ్లుగా ప్రాజెక్టు అభివృద్ధికి పైసా రావడం లేదు. ఎప్పటికప్పుడు ప్రతి యేడాది ప్రాజెక్టు ఆధునీకరణ కోసం నిధులు వస్తున్నాయని చెప్పడమే కానీ అవి ఇప్పటి వరకు రావడమే లేదు. నిధులు రాక ప్రాజెక్టు మరమ్మతులకు నోచుకోవడం లేదు. నీళ్ళు వదిలినా అవి పొలం దాకా వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. ఎక్కడికక్కడ కాలువలకు గండ్లుపడి పొలాలకు నీరందని పరిస్థితి ఏర్పడింది. ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఆశతో ఎదురుచూసే రైతులకు నిరాశ తప్పడం లేదు. జిల్లాకు మణిహారంగా నిలిచిన కోట్‌పల్లి ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. కల్వర్టులు, తూములు శిథిలమయ్యాయి. కాలువలు పూడుకుపోయాయి. 9200 ఎకరాలకు నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన కోట్‌పల్లి ప్రాజెక్టు ప్రస్తుతం 4వేల ఎకరాలకు కూడా నీరందించలేని పరిస్థితి ఏర్పడింది. పెద్దేముల్ మండలం కోట్‌పల్లి సమీపంలో 1964లో మాజీ ముఖ్యమంత్రి మర్రిచెన్నారెడ్డి హయాంలో కోట్‌పల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి కేవలం మూడు సంవత్సరాల్లో ప్రాజెక్టును పూర్తిచేశారు. 1967 లో ప్రారంభోత్సవం చేశారు. కోట్‌పల్లి ప్రాజెక్టు నిర్మించిన తొలినాళ్ళలో పంటపొలాలను సస్యశ్యామలం చేసింది. అలాంటి కోట్‌పల్లి ప్రాజెక్టు రాను రాను తన ప్రాభవాన్ని కోల్పోతుంది. ఆయకట్టు మొత్తానికి సాగునీరందించలేకపోతోంది. చాలా చోట్ల కాలువలకు గండ్లు పడి నీరు వృథాగా పోతోంది. ప్రాజెక్టునీటిని సాగుకోసం వదిలినపుడు వాగులు, వంకల్లో కలిసి వృథాగా పోతున్నాయి. ప్రాజెక్టు ఆధునికీకరణకు పాలకులు శ్రద్ధచూపక నిర్లక్ష్యం చేయడంతో ఆయకట్టు సాగు తగ్గిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ప్రధాన కాలువ నుంచి పిల్లకాలువకు నీరు మళ్లించే తూము శిథిలం



శిథిలమైన ప్రధానకాలువ తూము

మూడు కాలువల ద్వారా నీటి విడుదల

కోట్‌పల్లి ప్రాజెక్టు 1784 ఎకరాల్లో విస్తరించి ఉంది. నీటి సామర్థ్యం 24 అడుగులుగా ఉంది. ప్రాజెక్టుకు బేబికెనాల్, కుడి, ఎడమ అనే మూడు కాలువలు నిర్మించారు. వీటి ద్వారా 18 గ్రామాల్లోని పొలాలకు నీరందించాలనే ఉద్దేశంతో ప్రాజెక్టును నిర్మించారు. కుడి కాలువ కింద 8100 ఎకరాలు, ఎడమ కాలువ, బేబికెనాల్ కింద 1100 ఎకరాల ప్రతిపాదిత ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు నిర్మించిన మొదట్లో కుడికాలువ కింద ధారూరు మండలంలోని నాగసముందర్, అల్లాపూర్, రుద్రారం, బూర్గుగడ్డ, గట్టెపల్లి గ్రామాలు ఉన్నాయి. ఎడమకాలువ కింద పెద్దేముల్ మండలంలోని మన్‌సాన్‌పల్లి, మారెపల్లి, దుగ్గాపూర్, రుక్మాపూర్, కొండాపూర్, ఖానాపూర్, రేగొండి, మదనంతాపూర్, జనగాం, మంబాపూర్, తింసాన్‌పల్లి, బుద్దారం, పెద్దేముల్, గ్రామాలున్నాయి. బేబికెనాల్ కింద నాగసమందర్, బూర్గుగడ్డ సగభాగం, ఎడమకాలువ కింద రుద్రారం, గట్టెపల్లి సగభాగం నీరు పారు తుండేది. ప్రస్తుతం వీటిలో చాలా గ్రామాలకు నీరందడం లేదు.

మరమ్మతులు శూన్యం

కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువల ఆధునికీకరణ జరగడం లేదు. కాలువలు పూడుకుపోయాయి. పిచ్చిమొక్కలు మొలచి కాలువల రూపాన్నే మార్చేశాయి. తూములు శిథిలమయ్యాయి. ప్రధాన కాలువల నుంచి పిల్ల కాలువలకు నీరు మళ్లించడానికి ఏర్పాటు చేసిన తూములు పూర్తిగా శిథిలమయ్యాయి. వాటి నుంచి కాలువలకు నీరురాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎలాగైన ప్రభుత్వం నిధులు మంజూరు చేసి కాలువలు ఆధునికీకరిస్తే తప్పా, పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలకు ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీరు చేరినా శిథిలమైన కాలువల వల్ల నీరు వృథాగా పోతుంది. పంటలకు చేరకుండా వాగుల్లో కలిసి పోతున్నాయి. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి కాలువల మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



శిథిలమైన తూములో నుంచి నీరు పారించడానికి ఇలా అడ్డుకట్ట వేయాల్సిందే

తగ్గుతున్న ఆయకట్టు

9200 ఎకరాలకు నీరందించాలనే లక్ష్యంతో కోట్‌పల్లి ప్రాజెక్టును నిర్మించారు. కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి యాసంగికి నీరు వదలకుండా వానాకాలంంటల 7500 ఎకరాలకు మొదట్లో నీరందించారు. ఆ తరువాత 1996 నుంచి బుద్దారం, తింసాన్‌పల్లి గ్రామాల్లోని 1100 ఎకరాలను వాటికి నీటిని ఇవ్వలేమని ఆయకట్టు నుంచి తొలగించారు. తరువాత ఆరుతడి పంటలకు 4600 ఎకరాలకు మాత్రమే నీటిని అందించగలిగారు. ప్రస్తుతం 4వేల ఎకరాలకు కూడా సక్రమంగా నీరందంచలేని పరిస్థితి ఏర్పడింది. కాలువలను ఆధునికీకరించక పోవడతో ఆయకట్టు తగ్గిపోతోందని పలువురు పేర్కొంటున్నారు.



పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

ప్రాజెక్టు వద్ద పచ్చని చెట్లు కలిగి ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొని ఉంది. ఇక్కడికి అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులు విహారయాత్రకు ఇక్కడికి వస్తుంటారు. సినిమా షూటింగులు సైతం ఇక్కడ జరిగాయి. ప్రతి నిత్యం ప్రాజెక్టుకు వందలాది మంది పర్యాటకులు వస్తున్నారు. శని, ఆదివారాల్లో అయితే పర్యాటకుల రద్దీ మరీ ఎక్కువగా ఉంటుంది. చాలా మంది బోటింగ్ చేసేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా చేస్తే అక్కడ వసతులు సమకూరి విహారయాత్రకు ప్రజలు అధికసంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. అనంతగిరిని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయడంతో అక్కడికి వచ్చిన పర్యాటకులు కోట్‌పల్లి ప్రాజెక్టును తిలకించే అవకాశాలు చాలా ఉన్నాయి. ప్రాజెక్టునుపర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

పార్లమెంట్ స్థాయిలో జిల్లా ఏర్పాటుకు చర్యలు

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జనవరి 8: పార్లమెంట్ స్థాయిలో జిల్లా ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం యోచిస్తుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పరిగి మండల పరిషత్‌లో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాల విభజనలో వికారాబాద్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పారు. పార్లమెంట్ స్థాయి జిల్లా అయితే ఆదాయం పెరుగుతుందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల ఏర్పాటు కోసం సిట్టింగ్ లేదా రిటైర్డు జడ్జిలతో కమిషన్ వేయబోతున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయంలో చేపట్టిన పనులకు బిల్లులు ఇవ్వలేదని, జిల్లా వ్యాప్తంగా రూ.500ల కోట్ల పనులకు పెండింగ్ బిల్లులు రావాల్సి ఉందన్నారు. సర్పంచులు ఆందోళన చెందరాదని, అందరి బిల్లులు ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పనులు పూర్తయినవి, కొనసాగుతున్నవి, ఇంకా ప్రారంభించని పనుల వివరాలు నివేదికను తీసుకుని, ఆ దిశగా నిధుల మంజూరికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైల్వేలైను నిర్మాణం రీ సర్వేకోసం ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు.పూడూరులో కూ.2500ల కోట్లతో నేవీ రాడార్ ప్రాజెక్టు పనులు కూడా చేపట్టబోతున్నామని తెలిపారు. నేవీ రాడార్ ప్రాజెక్టు దగ్గర ఇంటర్నేషనల్ స్థాయి స్కూల్ పెడతామని, అందులో 50 శాతం స్థానికులు రిజర్వేషన్‌లు ఉంటాయని తెలిపారు. పరిగిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీసీ అరవింద్‌రావు, జడ్పీటీసీ బి.హరిప్రియ, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, కె.సత్యనారాయణ, శేషగిరిశర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కాన్ఫరెన్స్ హాల్‌గా రైతు వేదికలు!

- ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదికలు
- రైతులకు అందుబాటులోకి రానున్న అన్ని రకాల సేవలు
- సాకారం కానున్న రైతు వేదికల ఉద్దేశం

పైలెట్ ప్రాజెక్టు కింద నియోజవర్గానికో రైతు వేదిక ఎంపిక

మేడ్చల్ జనవరి 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రైతు వేదికలను దృశ్య, శ్రవణ(వీడియో కాన్ఫరెన్స్) కేంద్రాలుగా మార్చేందుకు ప్రభుత్వం ముమ్మర కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి వ్యవసాయ శాఖ మంత్రి మొదటి సమీక్షలోనే చర్చించినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు అన్ని రకాలుగా ప్రయోజనం చేకూర్చేందుకు రైతు వేదికలు నిర్మించింది. అనంతరం వాటిని పెద్దగా వినియోగించలేకపోయింది. రైతులకు వాటి ద్వారా మరింత సేవలు అందుబాటులోకి తేవడానికి ప్రస్తుత ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రైతులకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నిరంతరం ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, శాస్త్రవేత్తలతో పంటలపై అవగాహన కల్పించడానికి వీలుగా రైతు వేదికలను దృశ్య, శ్రవణ కేంద్రాలుగా తీర్చిదిద్దడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే నియోజకవర్గంలో ఒక రైతు వేదికను ఎంపిక చేసి జాబితాను, ప్రతిపాదనలు రూపొందించారు. రైతులకు ప్రభుత్వ అధికారుల పరిశీలనకు అనువుగా అందుబాటులే ఉండే రైతు వేదికలను ఎంపిక చేసి ప్రతిపాదించారు. వాటిని ఉన్నతాధికారులకు పంపించారు.

ప్రయోగాత్మకంగా..

దృశ్య, శ్రవణ కేంద్రంగా ఏర్పాటు చేయడానికి పైలెట్ ప్రాజెక్టుగా నియోజకవర్గానికి ఒక రైతు వేదికను ఎంపిక చేశారు. వీటి ద్వారా రైతులకు వ్యవసాయ, ఉద్యాన, పట్టు, మల్బరీ, మత్స్య, పశుసంవర్ధక, విద్యుత్, నీటిపారుదల శాఖలకు సంబంధించిన అన్ని ప్రభుత్వ పథకాలు, వివిధ సమాచారం అందించనున్నారు. సేవల ద్వారా రైతులకు ఎంతమేర ప్రయోజనం ఉంటుందో, రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి తర్వాత రైతు వేదికలన్నింటిలోనూ వంద శాతం ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఇందుకు సంబంధిత శాఖల నుంచి ప్రత్యేక దృష్టి సారించి రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సాగులో మెలకువలు, శాస్త్ర సాంకేతిక పద్ధతులు తెలిసేలా చూడాలని నిర్ణయించారు. కొత్తగా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ , పంటరుణాలు, రాయితీ వివరాలు తెలుసుకోవడానికి తహసీల్దార్ కార్యాలయంలో ఉండే వీడియో కాన్ఫరెన్స్ మాదిరి రైతులకు ఇది ఉపయోగపడనుంది.



పూడూరు క్లస్టర్ రైతువేదిక

నెట్ కనెక్షన్‌పై సర్వే...

ఎంపిక చేసిన రైతు వేదికలకు ఏయే నెట్ సేవలు అందుబాటులో ఉన్నాయో తెలుసుకునేందుకు బీఎస్ఎన్ఎల్, టీఎస్ ప్రభుత్వ నెట్‌వర్క్‌ల అధికారులు సర్వే చేశారు. ఏ కమ్యూనికేషన్ దగ్గరలో ఉంటే అవే సేవలు వినియోగించేలా ప్రణాళిక తయారు చేశారు. గతంలో రైతు వేదికలకు విద్యుత్ సౌకర్యం సైతం కల్పించారు. అయినా రైతువేదికలు మొక్కుబడిగానే మిగిలాయి. ప్రస్తుతం రైతులకు అవసరమైన శిక్షణలు ఇచ్చేందుకు వారానికి రెండుసార్లు(మంగళ, శుక్రవారాలు) కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. సమావేశ సమయంలో సాగవుతున్న పంటలు, ప్రభుత్వ పథకాలు, తదితర విషయాలపై అవగాహన కల్పించున్నారు. రైతు వేదికల్లో 125 కుర్చీలు, రెండు టేబుళ్లు, 8 పెద్ద కుర్చీలు, ఒక మైక్ సెట్ ఉన్నాయి. అన్నీ అందుబాటులో ఉన్నందున వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేస్తే అన్ని రకాలుగా ప్రయోజనకరంగా ఉంటుందని కొత్తగా దృశ్య, శ్రవణ కేంద్రంగా ఏర్పాటుకు నిర్ణయించారు. తద్వారా రైతులు పూర్తి సమాచారం తెలుసుకోవడంతో పాటు రైతు వేదికల ఉద్దేశం నెరవేరుతుందని భావిస్తున్నారు. ఒక్కో వీడియోతో పాటు అవసరమైన సామగ్రి కొనుగోలుకు రూ 3.75 లక్షలు వెచ్చించనున్నారు. సంక్రాంతి నాటికి జిల్లాలోని నియోజకవర్గంలో ఒక కేంద్రంలో ఏర్పాటు చేయాలని అధికారులు సంకల్పించినట్లు తెలిసింది.

మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరించాలి

- ఢిల్లీ నిజాముద్దీన్ మర్కజ్ తబ్లిక్ జమాతే చీఫ్ మౌలానా జంషెడ్ సాహెబ్
- ముగిసిన ఇస్తేమా మహాసభలు
- జన సంద్రంగా మారిన పరిగి.. స్తంభించిన ట్రాఫిక్

పరిగి/పూడూరు, జనవరి 8: మహ్మద్ ప్రవక్త బోధనలు ప్రతి ఇంట్లో నేర్పించాలని, ఢిల్లీ నుంచి గల్లీ వరకు తబ్లీక్ జమాత్ ద్వారా గ్రామాల్లో వివరించాలని, అల్లా బోధనల ప్రచారం కోసం పాదయాత్రలు చేయాలని ఢిల్లీ నిజాముద్దీన్ మర్కజ్ తబ్లిక్ జమాతే చీఫ్ మౌలానా జంషెడ్ సాహెబ్ అన్నారు. శనివారం ప్రారంభమైన ఇస్తేమా సభలు సోమవారం ముగిశాయి. చివరి రోజు సభకు ప్రధాన వక్తలుగా హాజరైన ఆయన ఢిల్లీ మర్కజ్ బాధ్యులు మౌలానా ఫారూఖీ, ముఫ్తీతో కలిసి మాట్లాడారు. నిజాయితీగా ఉండే వారికి దేవుడు అన్ని విధాలా అండగా ఉంటాడని, ప్రతి ముస్లిం ధర్మ ప్రచారాన్ని చేయాలన్నారు. కాగా ఈ సభలకు హాజరైన వారి కోసం తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి సదుపాయాలను జిల్లా పాలనా యంత్రాంగం కల్పించగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంది. 600 మందికి పైగా పోలీసులు బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముర్సాలీన్ బాయ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇన్‌ఛార్జి మౌలానా అబ్దుల్ సమద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి అలీమొద్దీన్‌లతోపాటు చేవెళ్ల ఎంపి రంజిత్‌రెడ్డి, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు ఎస్పీ మురళీధర్, పరిగి నాయకులు మీరుమహమూద్‌అలీ, వాజిద్ పాల్గొన్నారు.

జనసంద్రంగా మారిన పరిగి

పరిగి మునిసిపల్ పరిధిలోని పరిగి, న్యామత్‌నగర్ ప్రాంతం జనసంద్రగా మారింది. రెండు రాష్ట్రాలతోపాటు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది ముస్లీలు తరలిరావడంతో పెద్ద జాతరను తలపించింది. మూడు రోజులు కలిపి ఐదు లక్షల వరకు ముస్లింలు వచ్చినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఇజ్‌తెమ ప్రాంగణం పరిసరాల్లో పెద్ద ఎత్తున దుకాణాలు చేశారు. పరిగిలో జరిగిన ఇస్తేమా సభ ముగింపుతో ట్రాఫిక్ అంతారం ఏర్పడింది. సోమన్‌గుర్తి గేటు వద్ద బీజాపూర్-హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో వాహనాల రాకపోకలు, పార్కింగ్‌ను పరిశీలించారు.



ముస్లిం పెద్దలతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి

అమ్మా.. సల్లంగా సూడు

- నాగులపల్లిలో మైసమ్మకు బోనాలు

పెద్దేముల్, జనవరి 8: అమ్మా.. మా ఊరూ, వాడ చల్లగా చూడాలంటూ మహిళలు పెద్దఎత్తున బోనాలతో మైసమ్మ దేవతకు నైవేద్యం సమర్పించారు. సోమవారం పెద్దేముల్ మండల పరిధిలోని నాగులపల్లిలో గ్రామదేవత ఊరడమ్మ జాతర సందర్భంగా గ్రామస్తుల మైసమ్మ దేవతకు పూజలు నిర్వహించారు. అనంతరం శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పిల్లా పాపలను చల్లగా చూడాలని, పాడిపంట బాగుండాలని కోరుకున్నారు.



బోనాలతో ఊరేగింపు

జాతీయస్థాయి కరాటే పోటీల్లో తాండూరు విద్యార్థుల ప్రతిభ


మెడల్స్ సాధించిన తాండూరుకు చెందిన విద్యార్థులు

తాండూరు, జనవరి 8: షాద్‌నగర్‌లో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తాండూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఓపెన్ చాంపియన్‌షిప్‌లో సీనియర్ మాస్టర్ మోహన్ కృష్ణ బృందం తాండూరు నుంచి పోటీల్లో పాల్గొన్నారు. బ్లాక్ బెల్ట్ విద్యార్థులు హర్షిత్, మణికంఠ, హన్సికలు గ్రాండ్ చాంపియన్ కప్‌లను సాధించారు. నంద కిషోర్, రేవంత్, పల్లవి, మణికంఠ, బంగారు పతకాలను, రాకేష్, ఆకాష్, ప్రవీణ్‌కుమార్, శివకుమార్, అనుదీప్‌రెడ్డి వెండి పతకాలు సాధించారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో ప్రతిభ


విజేతగా నిలిచిన ఎండీ అన్వర్

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 8: మర్రిపల్లి గూడకు చెందిన మహ్మద్ అన్వర్ సీనియర్ బాడీబిల్డింగ్ మెన్స్ ఫిజిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచాడు. హైదరాబాద్, గచ్చిబౌలి ఎంఎస్ కన్వెన్షన్‌లో ఆదివారం రాత్రి జరిగిన బాడీబిల్డింగ్ 95కిలోల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి చాంపియన్ ఆఫ్ చాంపియన్‌గా నలిచాడు. దీంతో అన్వర్‌ను తోటి బాడీబిల్డర్లు, గ్రామస్తులు అభినందించారు.

సహకార అధికారుల డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 8: జిల్లా సహకార అధికారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం డైరీని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ట్రెయినీ కలెక్టర్ అమిత్ నారాయణ్, జిల్లా సహకార అధికారి శంకరాచారి, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, సంబంధిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిగిలో ఇస్తేమాకు తరలిన ముస్లింలు


సభాస్థలి వద్ద జనసందోహం

నవాబుపేట, జనవరి 8: పరిగి పట్టణ శివారులో మూడు రోజులుగా జరిగిన ఇస్తేమా కార్యక్రమానికి నవాబుపేట మండలంతో పాటు పరిసర గ్రామాల ముస్లిం సోదరులు భారీగా తరలి వెళ్లారు. చివరి రోజు సోమవారం వేలాది మంది ముస్లింలు పాల్గొన్నారు. దాదాపు 200 ఎకరాల్లో నిర్వహించిన ఇస్తేమా కార్యక్రమానికి దేశవిదేశాల నుంచి, కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి ముస్లింలు భారీగా తరలిరావడంతో ఎటు చూసినా జనసందోహమే కనిపించింది. ఇజ్తిమా కార్యక్రమంలో ఇస్లాం మతపెద్దల బోధనలను ముస్లిం సోదరులు శ్రద్ధగా విన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఎంతో మేలు


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్, జనవరి 8: పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆపదలో ఎంతగానో మేలు చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. కొడంగల్ క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ పరిధిలోని 14 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న వారికి సీఎం రేవంత్‌రెడ్డి చేదోడు, వాదోడుగా ఉంటారని తెలిపారు.

ఆలేరు ఎమ్మెల్యేకు సన్మానం


ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కురుమ సంఘం జిల్లా నాయకులు

కొడంగల్ రూరల్, జనవరి 8: ఆలేరు ఎమ్మెల్యేగా గెలుపొందిన బీర్ల ఐలయ్యను తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ కురుమ సంఘం కార్యాలయంలో సన్మానించారు. కురుమ సంఘం వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.నాగప్ప తదితరులు ఎమ్మెల్యేను శాలువాలు, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుమ గొల్ల కాపరుల సమస్యల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు.

ఆసరా పింఛన్ల కోసం ఆందోళన


లబ్ధిదారులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ, తహసీల్దార్

కులకచర్ల, జనవరి 8: చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం మందిపాల్ గ్రామ పింఛన్ లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. తపాల అధికారి పింఛన్ డబ్బులు ఇవ్వడం లేదని ఆదివారం సాయంత్రం సర్పంచ్ మఠం ప్రమీల ఇంటి వద్ద బైఠాయించిన విషయం తెలిసిందే. అయితే, చౌడాపూర్ తపాల అధికారి మందిపాల్‌లో పింఛన్ పంపిణీ చేయాల్సి ఉండగా, మిషన్ పని చేయడంలేదని, బ్యాంకులో డబ్బులు లేవని పలుసాకులు చెబుతూ ఐదు రోజులుగా పింఛన్ డబ్బులు పంపిణీ చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ రాందాస్‌నాయక్, తహసీల్దార్ ప్రభు కార్యాలయానికి చేరుకున్నారు. తపాల ఉన్నతాధికారులతో మాట్లాడతామని మంగళవారం నుంచి గ్రామంలో తపాలా అధికారి పింఛన్ డబ్బులు పంపిణీచేసే విధంగా చర్యలు తీసుకుంటాని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా రేణుకారెడ్డి


రేణుకారెడ్డి

బషీరాబాద్, జనవరి 8: బషీరాబాద్ మండలం మైల్వార్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా రేణుకారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ధారూరు మండల బీట్ ఆఫీసర్‌గా ఉన్న ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు. అడవుల సంరక్షణకు ఎప్పటికప్పుడూ తగిన చర్యలు తీసుకుంటానన్నారు.



శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఓంశాంతి కేంద్రం నిర్వాహకురాలు మధు అక్కయ్య

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

వికారాబాద్, జనవరి 8: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆయన సోమవారం రాత్రి ఓంశాంతి కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా కేంద్రం నిర్వాహకురాలు బ్రహ్మకుమారి మధు అక్కయ్య స్పీకర్‌ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఓంశాంతి కేంద్రం సేవలను అడిగి తెలుసుకున్నారు. మానసికంగా, శారీరకంగా పటిష్ఠంగా మారేందుకు యోగా, ధ్యానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎ.సుధాకర్‌రెడ్డి, శివారెడ్డిపేట సొసైటీ మాజీ చైర్మన్ ఎన్.కిషన్‌నాయక్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రమేష్‌కుమార్, సదానందం, పాల్గొన్నారు.

18మంది బాల కార్మికులకు విముక్తి

తాండూరు రూరల్, జనవరి 8: ఆపరేషన్ స్మైల్-10లో భాగంగా తాండూరు పట్టణంలోని వివిధ చోట్ల పనిచేస్తున్న 18మంది బాల కార్మికులకు విముక్తి కల్పించినట్లు బాలల రక్షణ కమిటీ అధ్యక్షుడు వెంకటేశం తెలిపారు. ఈనెలాఖరు వరకు బాల కార్మికుల విముక్తి కోసం ఆపరేషన్-10లో ప్రత్యేక దాడులు నిర్వహించి యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరూ ప్రైవేట్ దుకాణాల యజమానులు కానీ, చిన్నపరిశ్రమల యజమానులు కానీ 18ఏళ్లలోపు ఉన్న వారికి పనుల్లో పెట్టుకోవద్దని హెచ్చరించారు. ఆపరేషన్-1ఏలో కార్మిక శాఖ అధికారులతో పోలీసుల సహకారం తీసుకుని ముగ్గురు యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ సంతోష్‌రెడ్డి, బాలల రక్షణ కమిటీ ప్రతినిధి నరేష్‌కుమార్, లీగల్ ఆఫీసర్ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై గరం గరం

- సమావేశానికి హాజరు కాని అధికారులకు మెమోలు జారీ చేయండి
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, జనవరి 8: మూడు నెలలకొకసారి జరిగే సర్వసభ్య సమావేశంలో గ్రామ సమస్యలపై మొరపెట్టుకోవడమే తప్పా పరిష్కారం లభించడంలేదని వివిధ శాఖల అధికారుల తీరుపై సభ్యులు ఆగ్రహం వెళ్లగక్కారు. ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్ అధ్యక్షతన సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యుత్ అంశంపై చర్చకు రాగా సభ్యులు ఒక్కసారిగా పైకిలేచి ఏఈతో కరెంట్ సమస్యలపై ఏకరువు పెట్టారు. ఇళ్లు, పాఠశాలలపై కరెంట్ తీగాలు వెలాడుతున్నాయని మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని సర్పంచులు రథోడ్ సునీత, దశరథ్, గోళ్లభీమప్ప, శీధర్ తదితరులు ఏఈపై మండిపడ్డారు. అదేవిధంగా ఏఎన్ఎం, ఆశావర్కర్లు అందుబాటులో ఉండడంలేదని, మాసన్‌పల్లి సర్పంచ్ గోళ్లభీమప్ప సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు సక్రమంగా ఉండటంలేదని ఆయా గ్రామాల సర్పంచులు సూర్య, పద్మచందర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్అండ్‌బీ శాఖ అంశంపై చర్చకు రాగా వర్క్ ఇన్‌స్పెక్టర్ సమావేశానికి గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యే ఆరాతీశారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపీడీవో రమేష్‌ను ఆదేశించారు. అదేవిధంగా పర్యానాయక్ తండా సర్పంచ్ తమ గ్రామంలో బీటీరోడ్డు వేయాలని కోరారు. కొర్విచెడ్ సర్పంచ్ శోభారాణి పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా ఇంకా బేస్‌మెంట్ వద్దే పనులు నిలిచిపోయాయని తెలిపారు. కొత్లాపూర్‌లో 300ఎకరాల ప్రభుత్వ భూమి అటవీ, రెవెన్యూ శాఖల్లో ఎవరి ఆధీనంలోఓ ఉందో తేల్చాలని జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్, జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ శాంతాబాయిరామునాయక్, వైస్‌ఎంపీపీ జడల అన్నపూర్ణ, తహసీల్దార్ ఎన్.వెంకటస్వామి, ఎంపీడీవో రమేష్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బషీరాబాద్ రూపురేఖలు మారుస్తా: ఎమ్మెల్యే

సీఎం సాయంతో బషీరాబాద్ మండల రూపురేఖలు మారుస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బషీరాబాద్ సర్వసభ్య సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులు ఎప్పటికప్పుడూ గ్రామాలను సందర్శిస్తూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రతీ గ్రామంలో తిరిగానని, ప్రజలసమస్యలపై పూర్తిగా అవగాహన ఉన్నందున పరిష్కారానికి ప్రత్యేక దృష్టిపెడతానన్నారు. రానున్న వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

గత ప్రభుత్వం జారీ చేసిన జివోలు చిత్తుకాగితాలు

తాండూరు: గత ప్రభుత్వంలో జారీ చేసిన జివోలన్నీ చిత్తు కాగితాలేనని నిధులు లేకుండా జీవోలు జారీ చేశారని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ పనులకు సంబంధించి రూ.500 కోట్లు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రజాపాలనలో అధికారులు పనితీరు భేషుగ్గా ఉందన్నారు. ప్రజాపాలనలో 73,918 దరఖాస్తులు వచ్చాయని అందులో 23000 డేటా ఎంట్రీ పూర్తి చేసినట్లు తెలిపారు. తాండూరుకు రెండు రోజుల్లో మరో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని బీఆర్ఎస్ మూడో స్థానంలో ఉంటుందని మనోహర్ రెడ్డి జోస్యం చెప్పారు. తాండూరులో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి రూ.33కోట్ల నిధులు అవసరమవుతాయని తెలిపారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటామన్నారు. మన్నెగూడ నుంచి తాండూరు వరకు ఫోర్‌లైన్ రోడ్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా తాండూరులో బైపాస్ రోడ్డుపనులకు ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు రవిగౌడ్, సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, నీరజ బాల్‌రెడ్డి, బోయ రవిరాజ్, పెద్దేముల్ వైస్ ఎంపీపీ మధులత తదితరులు ఉన్నారు.

ఎంపీపీ జన్మదిన వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే

బషీరాబాద్: బషీరాబాద్ ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్ పార్టీ శ్రేణుల మధ్యన జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి హాజరై ఎంపీపీ దంపతులకు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి శోభారాణి దంపతులు ఎంపీపీకి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై ఎంపీపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



శంషాబాద్, జనవరి 8 : మున్సిపల్ కేంద్రంలోని రాళ్లగూడబస్తీలో గల జోషికుంట ప్రాంతంలో అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టిన ఓ కట్టడాన్ని సోమవారం ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. రాళ్లగూడ జోషికుంట పక్కనే ఉన్న ఔటర్‌రింగురోడ్డు పక్కన గల సర్వీసు రోడ్డు ప్రాంతంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మట్టి పోయించి చెరువుకు చెందిన భూమిని ఆక్రమించుకొని ఓ గోడ కూడా నిర్మించారు. విషయం తెలుసుకున్న అధికారులు కూల్చివేశారు.



కడ్తాలలో పథకాల గురించి వివరిస్తున్న తహసీల్దార్ ముంతాజ్

పథకాలపై చెంచులకు అవగాహన

ఆమనగల్లు, జనవరి 8: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై చెంచులకు అధికారులు అవగాహన కల్పించారు. ఆమనగల్లు పట్టణంతో పాటు శంకర్ కొండ తండాకు చెందిన చెంచులకు సోమవారం మండలంలోని వివిధ శాఖల అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీఎం జన జాతీయ ఆదివాసీ న్యాయ అభియాన్ పథకం అమలులో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు. ప్రధానంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు, రైతు భరోసా, రైతు బీమా పథకాల గురించి మండల వ్యవసాయ శాఖ అధికారిణి అరుణకుమారి వివరించారు. ఆయా పథకాలు రానివారు, ఆధార్, బ్యాంక్ అకౌంట్, ఓటర్ కార్డు, లేని వారు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. చెంచుల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బంది వారికి ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ఏఈవోలు శివతేజ, సాయిరామ్, గిరిజన సంక్షేమ అధికారి నయీమొద్దీన్, మెడికల్ ఆఫీసర్, డాక్టర్ పరిక్షీత్, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ శంకర్, చెంచు సేవా సంఘం రాష్ట్ర నాయకుడు నల్లబోతుల జంగయ్య, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కడ్తాల మండల కేంద్రంలోని 2వ వార్డు చెంచుకాలనీలో జన్‌మాన్ అభియాన్ పథకం గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పథకాలు అందని వారు, వివిధ కార్డులు లేని వారిని అధికారులు గుర్తించారు. తహసీల్దార్ ముంతాజ్, సీడీపీవో సక్కుబాయి, ఏవో శ్రీలత, సూపర్ వైజర్ శబరి, సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు నరేందర్ రెడ్డి, రాంచంద్రయ్య, మల్లేశ్‌గౌడ్, మల్లయ్య, శ్రీను, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

మంచు కాదు.. పొగే



మొయినాబాద్ మండలం హిమాయత్ నగర్‌లో ప్రదాన రోడ్డుపై పొగ

మొయినాబాద్ రూరల్, జనవరి 8 : ఈ చిత్రాన్ని చూస్తుంటే తెల్లవారుజామున పొగ మంచు కురుస్తుండగా ఆహ్లాదకరమైన వాతవరణంలో వాహనదారులు ప్రయాణిస్తున్నట్లుంది కదా.. కానీ అది పొగ మంచు కాదు. పొగమాత్రమే. సోమవారం హిమాయత్ నగర్ గ్రామం నుంచి చిలుకూరు బాలాజీ దేవాలయానికి వెళ్లే ప్రదాన రహదారిలో చెత్త వ్యర్థాలను హిమయత్ నగర్ గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా రోడ్డు పక్కనే కాల్చడంతో ఏర్పడిన పొగ. అది రహదారిపై వ్యాపించడంతో వాహనదారులు ఇబ్బందికరంగా ప్రయాణించారు. ఇలా రోడ్డు పక్కన చెత్తను కాల్చవద్దని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

సృజనాత్మక కళలో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థుల కళా ప్రదర్శన

షాద్‌నగర్‌రూరల్, జనవరి 8: ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకుల కళాశాల విద్యార్థినులు సృజనాత్మక కళలో ప్రతిభ కనబరిచారు. జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో సృజనాత్మక కళలపై పోటీలు నిర్వహించారు. జన్య ఫౌండేషన్, బ్రిస్టల్ ఆధ్వర్యంలో సమకూర్చిన బోధన, అభ్యాసన పరికరాల ద్వారా తరగతి గదిలో కృత్యముల ద్వారా నేర్చుకున్న సైన్స్ గణితంలోని అంశాలను విద్యార్థినులు ముగ్గుల రూపంలో ప్రదర్శించారు. వేస్ట్ మేనేజ్‌మెంట్, వాటర్ కన్జర్వేషన్, హెల్త్ అండ్ వెల్ బీయింగ్, సోలార్ ఎనర్జీ అనే అంశాలపై జన్య ఫౌండేషన్, బ్రిస్టల్ ప్రతినిధులు పోటీలు నిర్వహించగా గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులును ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విద్యులత, జన్య కో-ఆర్డినేటర్ యాదయ్య, అధ్యాపకులు హేమలత, శిరీష పాల్గొన్నారు.



కొండారెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 10ఎంవీఏ ట్రాన్స్‌పార్మర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

10ఎంవీఏ ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు

- సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కేశంపేట, జనవరి 8: మండలంలోని కొండారెడ్డిపల్లిలో ఎన్నికల ముందు హడావిడిగా 33/11 కేవీఏ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించి.. ఒక్క రోజులోనే 10ఎంవీఏ ట్రాన్స్‌పార్మర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయని తొలగించారు. దాంతో సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ జనవరి 5న 'ఆంధ్రజ్యోతి' రంగారెడ్డి జిల్లా ఎడిషన్‌లో ఏక్ దిన్ కా సబ్‌స్టేషన్ అనే శీర్షికతో కథనం ప్రచురితమయ్యింది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి మూడు రోజుల్లో సబ్‌స్టేషన్‌లో 10ఎంవీఏ ట్రాన్స్‌పార్మర్ బిగించారు. సర్వీసు ఫీడర్లను పునరుద్ధరించారు. ప్రస్తుతం కొండారెడ్డిపల్లి రైతాంగానికి, గృహ అవసరాల నిమిత్తం 24గంటల ప్రత్యేక లైన్ ఏర్పాటు చేశారు. అలాగే చింతకుంపల్లి, పోమాల్‌పల్లి గ్రామాలకు వ్యవసాయానికి సర్వీసు ఫీడర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా ప్రారంభించారు. సబ్‌స్టేషన్ ప్రారంభం కావడానికి కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి, చింతకుంటపల్లి గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. పనులు శరవేగంగా చేయించిన కేశంపేట ఏఈ ఈశ్వర్‌ను అభినందించారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

- రైల్వేకార్మికుల రిలే నిరాహార దీక్షలు



ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తున్న రైల్వే కార్మికులు

ఘట్‌కేసర్, జనవరి 8: నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విదానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్‌చేస్తూ సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఘట్‌కేసర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో కార్మిక నాయకులు మాట్లాడుతూ రైల్వేసేఫ్టీ కేటగిరిలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ట్రాక్‌మెన్‌లకు నైట్ పెట్రోలింగ్ డ్యూటీలో ఇద్దరిని కేటాయించాలన్నారు. కార్మికులకు అదనపు పనిభారాన్ని తగ్గించాలని సూచించారు. రైల్వే ప్రవేటీకరణను విరమించాలని డిమాండ్ చేశారు. రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటికీ రైల్వే శాఖలో అనేక విభాగాల్లో 12గంటల చొప్పున పని చేయిస్తూ శ్రమదోపిడికి పాల్పడుతున్నరని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మె చేయడానికి వెనుకాడేదిలేదని హెచ్చరించారు. ఈదీక్షలు ఈనెల 11వరకు కొనసాగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో బొల్లేపల్లి శ్రీనివాస్, వై.వెంకటేశ్వర్లు, హరికృష్ణ, దిలీప్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, అన్నపూర్ణ, కిరణ్, మల్లేష్, రవి, బాబు, భాస్కర్, అశోక్, వేణు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న రైల్వే యూనియన్ కార్మికులు

తాండూరు రూరల్: రైల్వే కార్మికులు సోమవారం తాండూరు రైల్వే స్టేషన్ వద్ద వేర్వేరుగా నిరసన నిరాహార దీక్ష చేపట్టారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రైల్వే మెన్, సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, ఎన్ఎఫ్ఐఆర్ పిలుపు మేరకు తాండూరు రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ్ తాండూరు బ్రాంచ్ సెక్రెటరీ పాశం లక్ష్మీనారాయణ, మజ్దూర్ యూనియన్ తాండూరు బ్రాంచ్ సెక్రెటరీ పి.కాళేశ్వర్, చైర్మన్ దేవేందర్‌లు మాట్లాడుతూ పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత నెలలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు విడిగా 50శాతం పింఛన్ ఇవ్వాలన్నారు. ప్రతీనెల 6వ తేదీన డీఏ కలపాలన్నారు. ఈ కార్యక్రమంలో అభినవ్‌రెడ్డి, వాజిద్, జయరాజ్, రహీమ్, మనోజ్‌కుమార్, నర్సింహులు, రాంచౌహాన్, మల్లేష్, రాములు, రాహుల్ రాథోడ్, అరుణ్ చౌరి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు రాబట్టాలి

వికారాబాద్, జనవరి 8: ఈ ఏడాది ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులు, ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలను ఆదేశించారు. ఇంటర్, పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న క్రమంలో విద్యార్థులకు సంక్రాంతి పండగ తరువాత నుంచి ప్రత్యేక తరగతులు పకడ్బందీగా నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈనెల 11వ తేదీన జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశానికి అధికారులు తమ శాఖల నివేదికలతో తప్పకుండా హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

ప్రజావాణి దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలి

వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే దరఖాస్తులను పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఆయన అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ నారాయణ్ అమిత్, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, డీఆర్‌డీవో కృష్ణలతో కలిసి ఆయన దరఖాస్తులు స్వీకరించారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



మాట్లాడుతున్న డైట్‌కళాశాల ప్రిన్సిపాల్ రామాచారి

వికారాబాద్, జనవరి 8: రాబోయే రోజుల్లో దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే విధంగా ఉత్తమ ఉపాధ్యాయులను తీర్చిదిద్దడమే డిప్లమా ఇన్ ఎలమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్.ఎడ్) కోర్సు లక్ష్యమని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామాచారి అన్నారు. ప్రభుత్వ డైట్ కళాశాలలో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 2023-25 విద్యా సంవత్సరంలో డీఎల్ఎడ్ కోర్సులో చేరిన ఛాత్రోపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వికారాబాద్ డైట్‌లో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాల్లో బోధించే డీఎల్ఎడ్ కోర్సు రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందన్నారు. ఈ కోర్సు శిక్షణ పూర్తి చేసుకున్న వారు 8వ తరగతి వరకు బోధించే అర్హత పొందుతారన్నారు. ఈ సందర్భంగా కోర్సు, తరగతి, బోధన తదితర అంశాలను గెస్ట్ లెక్చరర్లు పర్వతపల్లి బందెప్పగౌడ్, మహదేవి వివరించారు. ఈ కార్యక్రమంలో మహేష్, వెంకన్న, మనోహరి, నజీమా, అలావుద్దీన్, జ్ఞానరత్నం, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాషలపై పట్టు సాధించాలి

మేడ్చల్ టౌన్, జనవరి 8: విద్యార్థులు భాషలపై పట్టుసాధించాలని జేఎన్టీయూహెచ్ ఆంగ్ల భాష ఆచార్యులు డాక్టర్ ఎన్.వీ.ఎస్.ఎన్.లక్ష్మీ అన్నారు. గుండ్లపోచంపల్లిలోని మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఆగ్లభాషపై విద్యార్థులకు లెట్రసీ యూఫోరియా పేరిట ప్రత్యేక సదస్సును నిర్వహించారు. కళాశాల కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, చైర్మన్ జె.నర్సింహారెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ లోకనాథం, విభాగాధిపతి సాయికిణ్మయి, కన్వీనర్ శైలజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి సీఎం ప్రత్యేక దృష్టి



కొడంగల్: కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు, నాయకులు



కొడంగల్: క్యాంపు కార్యాలయంలో పూజల్లో పాల్గొన్న సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి

కొడంగల్, జనవరి 8: కొడంగల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ ఆథారిటీ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి (కడా)ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. కొడంగల్‌లో సన్ సిటీ కాలనీ గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేద పండితులతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డితో పాటు సీఎంరేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ పాటు నియోజకవర్గంలోని కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వీరితో పాటు వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ విజయ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తదితరులను సన్మానించారు. అనంతరం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గంలో మౌలిక వసతులు, విద్య, వైద్య ఇతరాత్ర అన్ని సమస్యలను పరిగణలోకి తీసుకొని సీఎం రేవంత్ రెడ్డికి నివేదిక అందిస్తామన్నారు. ఈప్రాంతంలో ఉన్న సహజ వనరులు, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పనులతో పాటు తదితర అంశాలపై ప్రణాళికతో ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం స్థల సేకరణ జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా ఇటీవలే రాష్ట్ర ప్రత్యేక చీఫ్ అధికారిణి రాణి కుముదిని, కలెక్టర్ నారాయణరెడ్డి కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించారని తెలిపారు. నియోజకవర్గానికి మంజూరైన గురుకుల పాఠశాలలు భవనాలు లేక ఇతర ప్రాంతాల్లో కొనసాగుతున్న వాటికి స్థలాల కేటాయింపుతో భవన నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు సమగ్రంగా ప్రణాళికలు తయారు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారుల ద్వారా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్త, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, నాయకులు శ్రీరాంరెడ్డి, నర్సింహులునాయుడు, సంజీవరెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



టీయూటీఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, జనవరి 8: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు టీయూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు విజ్ఞప్తి చేశారు. టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రచురించిన జిల్లా, వివిధ మండలాల నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆ సంఘం నాయకులు సోమవారం స్పీకర్ తన నివాసం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో టీయూటీఎఫ్ రాష్ట్ర బాధ్యుడు ఎం.గోపాల్, జంప్లా, జిల్లా బాధ్యులు సత్యనారాయణరెడ్డి, దేవ్యానాయక్, బసవరాజ్, కరుణాకర్, దేవయ్య, శివప్ప, సమియొద్దీన్, బందయ్య, శ్రీనివాస్, దీపక్‌రాథోడ్, సుధాకర్, సంతోష్‌కుమార్, శ్రీనివాస్, బాలకృష్ణ, బాబు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్, వెంకటేష్, ప్రసాద్, రెడ్యా, శ్రీనివాస్, మహిపాల్, జనార్ధన్, దేవయ్య పాల్గొన్నారు.

టీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) -2024 సంవత్సరం క్యాలెండర్‌ను శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆవిష్కరించారు. వికారాబాద్ పట్టణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కరణం దత్తాత్రేయరావు, ప్రధాన కార్యదర్శి పి.రాములు అసెంబ్లీ స్పీకర్ దృష్టికి తీసుకు వెళ్లారు. జీవో 317 ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, పండితుల అప్‌గ్రేడేషన్ పూర్తి చేయాలని వారు స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ సమద్, కార్యదర్శి పి.లక్ష్మయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.బలవంత్‌రెడ్డి, సంఘం నాయకులు ఎ.ప్రభాకర్, కృష్ణయ్య, వెంకటయ్య, విఠల్‌రెడ్డి, బాబయ్య మల్లేశం పాల్గొన్నారు.

10న పండగల సాయన్న విగ్రహావిష్కరణ

కులకచర్ల, జనవరి 8: ఈనెల 10వ తేదీన మండలంలోని ఇప్పయిపల్లి గ్రామంలో పండగల సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది చెలిమిల బాలముకుందం తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10న మండలంలోని ఇప్పయిపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పండగల సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముదిరాజ్ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, అఖిల భారత ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. ముదిరాజ్ కులస్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

క్రైం కార్నర్

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 8: ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ యువకుడు రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వేపోలీసుల కథనం ప్రకారం.. యాదాద్రి-భువనగిరి జిల్లా భువనగిరి మండలం వనపర్తికి చెందిన ఎలిమినేటి సాయినాథ్‌రెడ్డి(28) తల్లిదండ్రులతో కలిసి మేడ్చల్ జిల్లా, నాగారం మునిసిపాలిటీ ఆర్ఎల్‌నగర్‌లో నివాసముంటున్నాడు. సాయినాథ్‌రెడ్డి నగరంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై అప్పులపాలయ్యాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక సోమవారం ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధి యంనంపేట్ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వేపోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ

దోమ/నవాబుపేట, జనవరి 8: చోరీకి గురైన సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ యాప్ సాయంతో రికవరీ చేసినట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు. మండలంలోని బాసుపల్లి గ్రామానికి చెందిన కుండెల రామకృష్ణ గత సంవత్సరం అక్టోబర్ 25వ తేదీన గ్రామంలో దుర్గామాత నిమజ్జన వేడుకల్లో పాల్గొనగా గుర్తుతెలియని వ్యక్తి అతడి సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు దోమ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ యాప్ సాయంతో ట్రేస్ చేసి ఆ సెల్‌ఫోన్‌ను వినియోగిస్తున్న వ్యక్తిని గుర్తించారు. సోమవారం బాధితుడు రామకృష్ణకు ఎస్ఐ రవిగౌడ్ ఫోన్‌ను అందజేశారు. అదేవిధంగా నవాబుపేట మండలంలోని వివిధ గ్రామాలకు ఐదుగురికి సీఈఐఆర్ యాప్ సాయంతో ట్రేస్ చేసి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి సోమవారం ఎస్ఐ భరత్ భూషన్ నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

పూడూరు, జనవరి 8: అక్రమంగా లారీలో తరలిస్తున్న కలపను పట్టుకున్నట్లు చెన్‌గోముల్ ఎస్ఐ గిరి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మిర్జాపూర్‌గేటు సమీపంలో సోమవారం ఏఎస్ఐ సత్తయ్య ట్రాఫిక్ డ్యూటీ నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ నుంచి మన్నెగూడ వైపు వస్తున్న లారీని ఆపి తనిఖీ చేయగా కలప తరలిస్తున్నట్లు ఏఎస్ఐ గుర్తించారు. వాటికి సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో కలపను స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చేపలు పడుతున్న వారిపై ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 8: అవుషాపూర్‌లోని రాంచెరువు, గుండ్లకుంట చెరువుల్లో ప్రభుత్వసాయంతో పెంచుకుంటున్న చేపలను అక్రమంగా పడుతున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన మేడబోయిన జంగయ్య సోమవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొన్నేళ్లుగా ప్రభుత్వం పంపిణీ చేసిన చేప పిల్లలను రాంచెరువు, గుండ్లకుంట చెరువులలో పెంచుకుంటూ 25ముదిరాజ్ కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. రెండు చెరువుల్లో చేపలు పట్టడానికి వీలులేదని అదే గ్రామానికి చెందిన కె.అనిల్‌రెడ్డి, కె.వీరేష్, మల్లేషులు తాము పెంచిన చేపలను అక్రమంగా పడుతున్నారని తెలిపారు. తమ పట్టాభూమిలో చెరువులు ఉన్నాయని, అందులో చేపలు ఎలా పడుతారని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ జీవనోపాధికి అటంకం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మేడబోయిన జంగయ్య పోలీసులను కోరారు.

ఉత్సాహంగా ఆర్టీసీ వనభోజన కార్యక్రమం



కార్యక్రమంలో తాండూరు ఆర్టీసీ సిబ్బందితో అధికారులు

తాండూరు, జనవరి 8: తాండూరు ఆర్టీసీ డిపో ఆవరణలో సోమవారం వనభోజనం, ముగ్గుల పోటీల కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళా కండక్టర్లు డిపో ఆవరణమంతా రంగురంగుల ముగ్గులు వేశారు. డిపో మేనేజర్ సమత, సీఐ నిర్మల ముగ్గులను పరిశీలించి ప్రథమ, ద్వితీయ బహుమతులకు ఎంపిక చేశారు. వీటితోపాటు మహిళలు, పురుషులకు మ్యూజికల్ చైర్, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో ఆర్టీసీ ఉద్యోగులు సిబ్బంది డ్రైవర్లు కండక్టర్లతో సందడిగా వాతావరణం నెలకొంది. ఉద్యోగులంతా కలిసి భోజనాలు చేశారు.

ఒత్తిడి లేకుండా పనిచేయండి: ఆర్ఎం శ్రీధర్

ఆర్టీసీ ఉద్యోగులు కండక్టర్లు, డ్రైవర్లు సిబ్బంది అందరూ ఒత్తిడి లేకుండా పనిచేయాలని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చే బాధ్యత మనపై ఉందని ఆర్టీసీ ఆర్ఎం శ్రీధర్ అన్నారు. తాండూరు డిపోలో సోమవారం జరిగిన వనభోజన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిపోలోని ఉద్యోగులు సిబ్బందితో ముచ్చటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్రాంతి పండుగ వేళలో ప్రయాణికుల రద్దీ మరింత ఉంటుందని ప్రణాళిక ప్రకారం బస్సులను ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వనభోజన కార్యక్రమాన్ని, ముగ్గుల పోటీని ఉత్సాహంగా జరుపుకోవడం పట్ల డీఎం, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎం సమత, సీఐ నిర్మల, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదు సక్రమంగా చేయాలి



వికారాబాద్: కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి



ఘట్‌కేసర్: దరఖాస్తుల ఆన్‌లైన్ వివరాలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య



కులకచర్ల: ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదును పరిశీలిస్తున్న ఏపీడీ సరళాదేవి



మర్పల్లి: దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

వికారాబాద్, జనవరి 8: ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును తప్పులు దొర్లకుండా సక్రమంగా నమోదు చేయాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం కంటే ముందు ఆయన జిల్లా అధికారులతో మాట్లాడారు. ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. టీం లీడర్లు ప్రతీరోజు రెండు షిఫ్టుల్లో పనిచేయాలని, ఉదయం, సాయంత్రం 10 మంది వంతున రోజుకు 20 మంది కంప్యూటర్ ఆపరేటర్లతో రోజుకు వెయ్యి దరఖాస్తులను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. వివరాలు నమోదు చేసే సమయంలో దరఖాస్తుదారుడి ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నంబర్, ఎల్‌పీజీ గ్యాస్, పట్టాదారు పాసు పుస్తకం నంబరు, ఉపాధి హామీ జాబ్ కార్డు నంబర్ వంటి వివరాల్లో ఎలాంటి తప్పులు చోటు చేసుకోకుండా జాగ్రత్తగా నమోదు చేసేలా చూడాలన్నారు. డేటా ఎంట్రీ చేసిన దరఖాస్తులను భద్రపరచాలని, సమాచార సేకరణలో ఏమైనా అనుమానాలు ఉంటే దరఖాస్తుదారుడికి ఫోన్‌చేసి నివృత్తి చేసుకుని తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. శనివారం వరకు వెబ్‌సైట్‌లో నమోదు చేసే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

కీసర రూరల్: దమ్మాయిగూడ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని ఆన్‌లైన్ సెంటర్‌ను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12లోగా ఆన్‌లైన్ ప్రక్రియను ఎలాంటి తప్పులు దొర్లకుండా పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య మాట్లాడుతూ.. దమ్మాయిగూడలో మొత్తం 11,479 దరఖాస్తులు అందాయని తెలిపారు.

ఘట్‌కేసర్: కొండాపూర్‌లోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం చేపట్టిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య తనిఖీ చేశారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ఎండీ సాబేర్‌అలీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కులకచర్ల: ప్రజాపాలనలో లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఏపీడీ సరళాదేవి పరిశీలించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ఆన్‌లైన్ నమోదును పరిశీలించి సిబ్బంది సూచనలు చేశారు. ఇప్పటి వరకు కంప్యూటర్ ఆపరేటర్‌లు 200 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వెంకటేశ్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి: మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన సదస్సుల్లో 15,941 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 17వరకు కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. టీంలుగా ఏర్పడి 20మంది ఆపరేటర్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆన్‌లైన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఓ వైపు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియలో సాంకేతికలోపం కారణంగా ఆలస్యమవుతోందని చెబుతున్నారు.

తాండూరు రూరల్: తాండూరు మండలంలో వచ్చిన 15,283 దరఖాస్తులతోపాటు మరో 4,045 దరఖాస్తు ఫారాలను కంప్యూట ర్ ఆపరేటర్లు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. తాండూరు మండల పరిషత్ కార్యాలయంతో పాటు తహసీల్దార్, మండల విద్యాధికారి కార్యాలయంలో 26 కంప్యూటర్లను ఏర్పాటు చేసి నమోదు ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఈ నమోదును తాండూరు తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి రతన్‌సింగ్‌లు పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 17వ తేదీ వరకు డాటా ఎంట్రీ పూర్తిచేసేలా చర్యలు చేపట్టారు.



తాండూరు రూరల్: ప్రజాపాలన దరఖాస్తులను ఎంట్రీ చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

ఘట్‌కేసర్ రూరల్: ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు గతనెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజల నుంచి 15,108 దరఖాస్తులను స్వీకరించినట్లు ఎంపీడీవో అరుణారెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ మండలంలోని 11గ్రామాల్లో ప్రజాపాలన ఆరు గ్యారంటీలతో పాటు ఇతర దరఖాస్తులను స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. అంకుషాపూర్‌లో అభయహస్తం దరఖాస్తులు 841, ఇతర దరఖాస్తులు 106 వచ్చినట్లు తెలిపారు. అవుషాపూర్‌లో 1,195, ఇతర 85, చౌదరిగూడలో 2,473, ఇతర 914, ఎదులాబాద్‌లో 1953, ఇతర 291, ఘనాపూర్‌లో 586, ఇతర 143, కాచవానిసింగారంలో 1,640, ఇతర 762, కొర్రెములలో 1,373, ఇతర 455, మాదారంలో 77, ఇతర 16, మర్రిపల్లిగూడలో 365, ఇతర 88, ప్రతాప్‌సింగారంలో 732, ఇతర 301, వెంకటాపూర్‌లో 535, ఇతర 177 దరఖాస్తులను స్వీకరించినట్లు ఎంపీడీవో తెలిపారు.

మాదకద్రవ్యాల విక్రయంపై నిఘా పెట్టాలి



మాట్లాడుతున్న ఎస్సీ గుల్షన్

కొడంగల్ రూరల్, జనవరి 8: కొడంగల్ నియోజకవర్గంలో మాదకద్రవ్యాలపై నిఘా పెట్టాలని ఎంబీఎం కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్సీ.గుల్షన్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సీఎం ఇలాఖాలో గంజాయి, మత్తు పదార్థాల రవాణా జోరుగా సాగుతోందని ఆరోపించారు. దీంతో కళాశాల, పాఠశాలల విద్యార్థులు, యువత మత్తుకు బానిసలవుతున్నారని తెలిపారు. విద్యార్థులు బంగారు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముందని హెచ్చరించారు. కొడంగల్ ప్రాంతం కర్ణాటక సరిహద్దులో ఉండటంతో గుట్టుచప్పుడు గంజాయి రవాణా చేస్తున్నారని ఆరోపించారు. మాదకద్రవ్యాలతో పట్టుబడిన ఘటనలు అనేకమున్నాయని గుర్తుచేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పటిష్ట నిఘాతో గంజాయి విక్రయాలు, రవాణాపై ప్రత్యేక నిఘాపెట్టాలని కోరారు. పట్టుబడిన వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం

పరిగి, జనవరి 8: పరిగి పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.మధుసూదన్, వేముల కిరణ్, కోశాధికారి మల్లేశ్, ఉపాధ్యక్షులు ఎ.వెంకటేశ్, ఎం.విజయ్‌కుమార్, ఎం.వేణుగోపాల్, సహాయ కార్యదర్శులు ఎం.ఆదిశంకర్, దోమ శ్రీకాంత్, కె.నర్సింహరాజు, సహాయ కోశాధికారులు డి.దామోదర్, కె.విశ్వనాథం. ఎ.రఘు, కె.హర్షవర్ధన్‌తోపాటు, కార్యవర్గసభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షకార్యదర్శులు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల హక్కులు, సంక్షేమం కోసం పని చేస్తామని తెలిపారు.

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ



దోమ: గోడుగొనిపల్లిలో అయోధ్య రాముడి అక్షింతల పంపిణీలో గ్రామస్థులు

శామీర్‌పేట, జనవరి 8: అయోధ్య రామయ్య అక్షింతలు మండల కేంద్రం శామీర్‌పేటలో ఇంటికి పంపిణీ చేశారు. సోమవారం శామీర్‌పేటలోని రామాలయం నుంచి గ్రామస్తులు అయోధ్య నుంచి వచ్చిన రామయ్య అక్షింతలను ఎంతో భక్తి శ్రద్ధలతో పంపిణీ చేశారు.

తాండూరు రూరల్: గౌతాపూర్‌లో సోమవారం అయోధ్య రామయ్య అక్షింతలను అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు జెర్నె నాగప్ప ఆధ్వర్యంలో పలువురు ఇంటింటికి తిరిగి అయోధ్య రామయ్య అక్షింతలు పంచారు.

దోమ: గోడుగోనిపల్లి గ్రామంలో సోమవారం గ్రామ యువకులు ఆయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమలో హనుమాన్ దేవాలయం పూజారి నాగమూర్తి,యువకులు పాలెపల్లి మహేశ్, బాలవర్ధన్‌రెడ్డి, గొగ్గి మహేశ్, మల్లేశ్, చింటు, సాయికుమార్, నవీన్, శివ, నరేశ్, యాదయ్య పాల్గొన్నారు.



కులకచర్ల: ఘనపూర్ గ్రామంలో అక్షింతలను పంపిణీ

కులకచర్ల: గ్రామాల్లో అయోధ్య శ్రీరాముడి అక్షింతలను ఇంటింటి పంపిణీ చేశారు. మండలంలోని ఘనపూర్ గ్రామంలో సోమవారం ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతలను అందజేశారు. ఈ నెల 22న దేశం మొత్తం పండగ జరుపుకుంటుందని, ప్రతీ ఇంటిలో అందరూ దీపాలు వెలిగించాలని సూచించారు.

బొంరాస్‌పేట్: అయోధ్యలో రామమందిరం విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా దుద్యాల గ్రామంలో పవిత్ర అక్షింతలను సోమవారం ఇంటింటికి పంపిణీ చేశారు. గ్రామ పురవీధుల మీదుగా రాముని కరపత్రాలు, అక్షింతలతో ఊరేగింపుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మ్యాకం ప్రకాకర్, విశ్వనాథం, కమ్మరి మొనయ్యఆచారి, సంజీవ్‌కుమార్, రాములు, వెంకటయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అభినందనీయం

మేడ్చల్ టౌన్, జనవరి 8: మారుమూల గ్రామాల పేదలకు వైద్యసేవలందించడం అభినందనీయమని ఎల్లంపేట సర్పంచ్ మేకల వెన్నల రామకృష్ణుడు అన్నారు. మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో రోగులకు బీపీ, షుగర్, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ ఆసుపత్రి వైద్యబృదం, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



కీసర రూరల్, జనవరి 8 : నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధి 10వ వార్డు సింహపురి కాలనీలో మున్సిపల్ నిధులు రూ.20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, స్థానిక కౌన్సిలర్ దివ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు దయాకర్ పాల్గొన్నారు.